క్లుప్తంగా

విద్యార్థి నిజాయతీకి అభినందనలు



సత్తెనపల్లి: మండల పరిధిలోని ధూళిపాళ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న భీమాల రుత్విక్ నిజాయతీని ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. పాఠశాల ఆవరణలో ఆడుకునే సందర్భంలో రుత్విక్‌కు పర్సు దొరకగా దాన్ని తరగతి ఉపాధ్యాయుడైన బండి రమేష్ బాబుకు అందజేశాడు. ఆ పర్సులో ఏటీఎం కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులతో పాటు కొంత నగదు ఉంది. పర్సు పోగొట్టుకున్న కొనకంచి వెంకట సురేష్‌ను గుర్తించి ఆయనకు అందజేశారు. విద్యార్థి భీమాల రుత్విక్ నిజాయతీని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రశంసిస్తూ నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర సర్కారును గద్దె దించాలి

చిలకలూరిపేట: అన్ని వర్గాల ప్రజల హక్కులు హరించి వేస్తూ నిరంకుశ విధానాలతో పాలన కొనసాగిస్తున్న మోదీ సర్కారును గద్దె దించడానికి కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ నెల 9 తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలో ప్రచార జాతాను శుక్రవారం పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు క్విట్ మోదీ, సేవ్ ఇండియా నినాదంతో విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాకు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి, సీపీఐ ఏరియాకార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు పాల్గొన్నారు.

హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



యడ్లపాడు: దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో వైద్యంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరావు పేర్కొన్నారు. యడ్లపాడు రచ్చబండ సెంటర్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. చిలకలూరిపేటకు చెందిన శ్రీవల్లీ హోమియో కేర్ వైద్యశాల వైద్య నిపుణులు పి.వి. సునీల్ కుమార్ ప్రారంభపు సమావేశంలో హోమియో వైద్యం వాటి ప్రయోజనాలపై రోగులకు అవగాహన కల్పించారు. వివిధ వ్యాధులు వాటి లక్షణాలు, హోమియో వైద్యంతో నివారణ గురించి వివరించారు. అనంతరం 160 రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందుల్ని అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జి బాబు, ఎడ్లపాడు మండల అధ్యక్షురాలు చెరుకూరి సృజన, వైఎస్సార్ ఉద్యా న యూనివర్సిటీ పాలకమండలి మాజీ సభ్యులు పోపూరి శివ రామకృష్ణ, పోపూరి సుబ్బారావు, ఎస్ సుందర బాబు, షేక్ కరీమూన్, డా.ప్రతిమ, జి.ప్రశాంత్‌రెడ్డి, గోపి, మర్రి భాస్కర్, సాగి మల్లికార్జున్, కార్చిల స్వప్నకుమార్, చుక్కా విన్సెంట్‌పాల్ పాల్గొన్నారు.

గ్రామీణుల చెంతకు బ్యాంకు సేవలు

బొల్లాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలు విస్తరింపజేయడంలో భాగంగా బ్యాంకు శాఖ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం ఎస్. సుబ్రమణ్యం అన్నారు. మండల కేంద్రం బొల్లాపల్లిలో ఎస్‌బీఐ బ్యాంకు శాఖ శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ బ్యాంకు అవసరాల నిమిత్తం గ్రామాల నుంచి పట్టణాలకు రావాల్సి వస్తున్న దృష్ట్యా గ్రామాల్లో బ్యాంకు సేవలు విస్తరింపజేశామని తెలిపారు. బ్యాంకు సేవలను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. సేవలు సులభతరంగా, సౌలభ్యంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్ జి. దినేష్, బ్రాంచి మేనేజర్లు డి. హరి, వి. ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్సార్ అవార్డుకు దరఖాస్తులకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైమ్ అవార్డు-2023 కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ చీఫ్ కోచ్ పి.అఫ్రోజ్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, వ్యాపారం, విద్య, వైద్యం, సివిల్ సర్వీసెస్, క్రీడలు తదితర రంగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలు అందించిన అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా తమ దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా పంపాలని ఆయన కోరారు.

నాడు సేద్యం అసాధ్యం... నేడు సుభిక్షం

- అన్నదాతలకు అండగా ప్రభుత్వం
- వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో విస్తృత సేవలు
- రాయితీపై యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, విత్తనాల పంపిణీ
- గ్రామాల్లో కొండంత అండగా 16 రైతు భరోసా కేంద్రాలు



రైతు భరోసా కేంద్రంలో రైతుల సమావేశం (ఫైల్)

అమరావతి: భూమిని నమ్ముకున్న రైతన్నలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని సీఎం వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం నమ్మి, వారి సంక్షేమం కోసం పాటుపడుతోంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో లాభాల సాగు చేయాలనే ఉద్దేశంతో అన్ని విధాలా అండగా నిలుస్తోంది. ఈ నాలుగేళ్లలో సాగుకు పెట్టుబడి సాయం అందించింది. సాగునీటి వనరులు అందించడానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ప్రతి ఊరికి రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి రైతుకు భరోసా కల్పిస్తోంది.

గత ప్రభుత్వంలో అన్నీ అవస్థలే...

గత ప్రభుత్వంలో రైతులకు సకాలంలో విత్తనాలు ఎరువులు అందక నానా అవస్థలు పడ్డారు. ఒకవేళ దొరికినా నకిలీలతో మోసపోయిన సందర్భాలు అనేకం. ఒక సమయంలో రైతులు గత్యంతరం లేక పంటలు వేయకుండా దయనీయ పరిస్థితుల్లో ఉండిపోయారు. మరోవైపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను రైతుల పేరిట నమోదు చేసి, ఆ తర్వాత స్థానిక నాయకులు కాజేసిన సంఘటనలు గతంలో అనేక ఉన్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసింది. మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, మొదలైనవన్నీ రైతుల ముంగిటకే చేర్చింది. ఈ సంస్కరణలు, జవాబుదారీతనంతో అందిస్తున్న సేవలు వ్యవసాయంపై రైతుకు భరోసా ఇచ్చాయి. వ్యవసాయం దండగ నుంచి నేడు పండుగలా మారింది.

రైతులకు చేదోడువాదోడుగా సలహా మండళ్లు

మండలంలోని 20 గ్రామాల్లో 16 రైతు భరోసా కేంద్రాలు పని చేస్తున్నాయి. ప్రధానంగా ప్రత్తి, మిరప, జొన్న, మొక్కజొన్నతో పాటుగా ఉద్యాన పంటలు కూడా సాగు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అనేక సేవలు అందుబాటులోకి తెచ్చింది. గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఉద్యాన శాఖ సిబ్బందిని నియమించింది. ప్రతి గ్రామంలో రైతులకు నాణ్యమైన సేవలు అందించడానికి వ్యవసాయ సలహా మండలితో పాటుగా మండల స్థాయిలో కూడా ఏర్పాటు చేసింది. ప్రతి నెలా మొదటి శుక్రవారం గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులతో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహిస్తోంది. ఆ నెలలో రైతులకు అందాల్సిన సేవలపై చర్చించి, ప్రాధాన్యత క్రమంలో ప్రణాళిక తయారు చేసుకుంటారు. రెండో శుక్రవారం మండల స్థాయిలో సమావేశం నిర్వహించి గ్రామాల నుంచి వచ్చిన అంశాలపై చర్చించి మండల స్థాయిలో ప్రణాళిక సిద్ధం చేస్తారు.

రూ. 56.94 కోట్ల రైతుభరోసా సాయం

రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం ద్వారా 10427మంది రైతుల ఖాతాలకు 2019 నుంచి ఐదు విడతలుగా రూ .56.94 కోట్లను సీఎం వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం జమ చేసింది. మండలంలో వైఎస్సార్ వ్యవసాయ యంత్రసేవా పథకం ద్వారా 16 రైతుభరోసా కేంద్రాల్లో 11 రైతు గ్రూపులకు ట్రాక్టర్లు, మిగిలిన ఐదు రైతు గ్రూపులకు వ్యవసాయ యంత్రాల్ని పంపిణీ చేసింది.

మాటిచ్చిన ప్రకారం పెట్టుబడి సాయం



నాడు పాదయాత్రలో మాటిచ్చిన ప్రకారం సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెట్టుబడి సాయాన్ని 2019 నుంచి ఐదుసార్లు అందించారు.రైతుల కష్టాలు తెలుసుకుని ఈ ఏడాది తొలి విడత సాయాన్ని ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే ఖాతాలకు జమ చేశారు. వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ కింద ఏటా అందిస్తున్న సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది

– ఎనుముల సుధాకరరెడ్డి, రైతు, మునగోడు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రైతు మిత్రా గ్రూపు కిందట ట్రాక్టరు తీసుకున్నాం . మొత్తం రూ. 8,64,600కు గానూ ప్రభుత్వం రూ, 3,40,000 రాయితీ ఇచ్చింది. ట్రాక్టర్ చేతిలో ఉండటంతో తక్కువ ఖర్చుతో చిన్న, సన్నకారు రైతులంతా సకాలంలో పొలాన్ని దున్నుకుంటున్నారు. వ్యవసాయంలో యంత్రాలతో పని బాగా పెరిగింది. రైతులకు అవసరమైన యంత్ర పరికరాల్ని సబ్సిడీపై అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

– అద్దంకి హనుమంతరావు, నంబూరి యువసేన రైతుమిత్రా గ్రూపు కన్వీనర్, ఎండ్రాయి

రైతులకు సత్వరమే సేవలు



విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలుకు లోగడ రైతులు దగ్గరలో ఉన్న టౌన్‌కో, మండల కేంద్రాలకో వెళ్లి ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అన్నీ రైతుభరోసా కేంద్రాలలోనే అందిస్తున్నాం. రైతులకు వ్యవసాయానికి కావాల్సిన సమాచారమంతా ఇక్కడే ఇస్తున్నాం. ప్రభుత్వ పథకాలు, యంత్రాలు, విత్తనాలపై సబ్సిడీల్ని త్వరితగతిన అందిస్తున్నాం. రైతులకు సత్వరమే సేవలు అందించడంలో రైతుభరోసా కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి

– అహ్మద్, మండల వ్యవసాయశాఖాధికారి, అమరావతి మండలం

మాతా, శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



పట్టణంలోని 12వ వార్డులో కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లోకా కల్యాణి



పట్టణంలోని 22వ వార్డులో కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ శెట్టి ఆనంద్

సత్తెనపల్లి: మాతా, శిశు సంరక్షణ ప్రభుత్వ ధ్యేయమని 12వ వార్డు కౌన్సిలర్ లోక కల్యాణి అన్నారు. పట్టణంలోని 12వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు శుక్రవారం ఆమె పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లీ, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లోకా మాధవ, మహిళా పోలీస్ భవానీ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

- పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం కౌన్సిలర్ శెట్టి ఆనంద్ జగనన్న పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమాజ రూపకల్పనే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు అంజనాదేవి, పెద్ద మాణిక్యం, ఎస్ఎం భాగ్యరేఖ, మహిళా పోలీస్ తిరుమల లక్ష్మి పాల్గొన్నారు.
- పట్టణంలోని 14వ వార్డులో కౌన్సిలర్ గద్దం శ్రీలత కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గద్దం వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్త గీతారాణి,ఆయాలు పాల్గొన్నారు.
- 19వ వార్డులో కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ , శిశు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బిట్రా స్వాతి, ఆయాలు పాల్గొన్నారు.



పట్టణంలోని 14వ వార్డులో కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ గద్దం శ్రీలత



పట్టణంలోని 19వ వార్డు సుందరయ్య కాలనీలో కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు

• శభాష్ వలంటీర్



హైదరాబాద్‌లో సుబ్బారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బాబూరావు

సత్తెనపల్లి: వలంటీర్ సేవా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మందడపు సుబ్బారావు అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. ఆయన మనవడు మందడపు గణేష్ వికలాంగుడు కావడంతో హైదరాబాదులోనే ఉన్నాడు. వీరితోపాటు మంగళగిరి ఎయిమ్స్ లో గ్రామానికి చెందిన నెల్లూరు శివమ్మ రెండు మాసాలుగా చికిత్స పొందుతోంది. ఈ ముగ్గురికి గ్రామ వలంటీర్ భట్లూరు బాబూరావు పింఛన్లు పంపిణీ చేశాడు. హైదరాబాదు, మంగళగిరి దూర ప్రాంతాలైనప్పటికీ లెక్క చేయకుండా సకాలంలో వారి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో ప్రభుత్వ పనితీరును, వలంటీర్ల సేవా దృక్పథాన్ని గ్రామ ప్రజలు కొనియాడుతున్నారు.

గుంటూరులో వృద్ధురాలికి..

క్రోసూరు: అనారోగ్యంతో గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు సుగ్గన పుష్పావతికి శుక్రవారం క్రోసూరు-3 సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పి.శ్రీలత పింఛన్ అందజేశారు. వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో గాయపడి, గత ఐదు రోజులుగా గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అక్కడికి నగదు అందజేశారు. ఆస్పత్రిలో ఉన్న తనకు పింఛన్ అందజేయడంపై పుష్పావతి ఆనందం వ్యక్తం చేశారు.

ఇక్కుర్రు సొసైటీ సేవాతత్పరతకు అవార్డు



మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి నుంచి అవార్డు అందుకున్న ఇక్కుర్రు సొసైటీ చైర్‌పర్సన్ కె. శ్రీనివాసరావు

నరసరావుపేట : మండలంలోని ఇక్కుర్రు పీఏసీఎస్ సేవాతత్పరతను గుర్తించి ఆప్కాబ్ వజ్రోత్సవాలలో శుక్రవారం అవార్డు అందజేశారు. ఈ అవార్డును విజయవాడలోని ఎ1-కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర సహకార సహాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి చేతుల మీదుగా ఇక్కుర్రు సొసైటీ చైర్‌పర్సన్ కన్నెబోయిన శ్రీనివాసరావు, సీఈవో కంటు శ్రీనివాసరావు అందుకున్నారు. ఇక్కుర్రు సొసైటీ ఉత్తమ సేవా అవార్డు అందుకోవడంపై పలువురు సొసైటీల చైర్‌పర్సన్లు, సీఈవోలు అభినందించారు. అభినందించిన వారిలో చైర్‌పర్సన్‌లు పోలకొమ్ము వెంకటరెడ్డి, చిన్నపరెడ్డి శివారెడ్డి, ద్రోణాదుల చిన రమణారెడ్డి, మేడికొండ వీరారెడ్డి, వట్టికొండ ఆంజనేయులు, పాలిమేర వెంకటరెడ్డి, కేతు పెదచౌడారెడ్డి, చింతగుంట అంజిరెడ్డి, సీఈవోలు పాలిమేర వెంకటరెడ్డి, నంద్యాల వీరారెడ్డి, మహిపతి రామాంజనేయులు, భవనం వెంకటేశ్వరరెడ్డి, కనకా శివారెడ్డి, గానుసపంట వీరారెడ్డి ఉన్నారు.

వెద పద్ధతిలో వరి సాగు లాభదాయకం



శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్

పలుదేవర్లపాడు(ముప్పాళ్ల): వెద పద్ధతిలో వరి సాగు ఎంతో లాభదాయకమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ డాట్ సెంటర్ శాస్త్రవేత్త జి.రమేష్ సూచించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని చెప్పారు. మండలంలోని పలుదేవర్లపాడులో వ్యవసాయశాఖ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. వెద పద్ధతిలో వరిసాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అనివార్య పరిస్థితుల్లో వాతావరణం అనుకూలించక కాలువలు రాని పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా కంది, మినుముతో పాటుగా ఆరుతడి పంటలుగా తెల్ల జొన్న, మొక్కజొన్న పంటలు వేసుకోవాలని సూచించారు. డీఆర్సీ డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడుతూ వరిని వెద పద్ధతిలో సాగు చేసినప్పుడు ఎక్కువగా ఇనుప ధాతు లోపం కనిపిస్తుందని చెప్పారు. కొత్తగా వచ్చిన ఆకులు తెల్లగా అయినప్పుడు అన్నభేది, నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వెద పద్ధతిలో వరి సాగులో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. డీఆర్సీ ఏవో ఎస్. ప్రవీణ్ మాట్లాడుతూ రైతు నికర ఆదాయాన్ని పెంచుకోవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఎరువుల్ని అవసరమైన మేర మాత్రమే వాడుకోవాలని, మట్టి పరీక్షలకు అనుగుణంగా వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల భూమిలో సూక్ష్మజీవులు పెరిగి భూసారం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ ప్రియాంక, వీఆర్వో సుబాషిణి, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



సమావేశంలో మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ హనుమంతరావు

సత్తెనపల్లి: తల్లిపాలు అమృతంతో సమానమని ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఏ.హనుమంతరావు తెలిపారు. పట్టణంలోని వేద నర్సింగ్ స్కూలులో తల్లిపాల ప్రాధాన్యతపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలలో అనేక పోషకాలున్నాయని చెప్పారు. నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ మాట్లడుతూ మారుతున్న కాలంలో మహిళలు ఎక్కువగా రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని, దానికి ప్రధాన కారణం బాలింత సమయంలో పిల్లలకు పాలు ఇవ్వక పోవడమేనని తెలిపారు. ప్రసవించిన వెంటనే ముర్రుపాలను బిడ్డకు అందిస్తే, అవి అమృతంతో సమానమని చెప్పారు. ఈ సందర్భంగా జీఎన్ఎం విద్యార్థులు తల్లిపాల ప్రాధాన్యం, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు తదితర అంశాలపై సదస్సులో చర్చించారు. అనంతరం తల్లిపాల ఔన్నత్యాన్ని తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది నాగరాజు, గౌస్, స్కూల్ అకాడమిక్ ఇన్‌చార్జి చింతాడ సూర్యప్రకాష్, చింతాడ రమేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి రత్నాకర్

రాజుపాలెం: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రక్త పరీక్షల నమూనాలు, మలేరియా, డెంగీ పరీక్షల ల్యాబ్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడారు. డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వానా కాలంలో దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వీటిపై గ్రామాల్లో వివరించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉషారాణి, గ్లోరి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్



వెల్లటూరు సచివాలయంలో లబ్ధిదారులకు ఓటీఎస్ డాక్యుమెంట్లు అందజేస్తున్న సర్పంచ్

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు సచివాలయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్, రిజిస్టర్ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు శుక్రవారం సర్పంచ్ ఎం. చిన్న వీరయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఇంటి నిర్మాణం కోసం రుణం తీసుకున్న లబ్ధిదారులకు సులభతరంగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ల ద్వారా చెల్లింపునకు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ పథకంలో రుణాలు చెల్లించిన లబ్ధిదారులకు ఇంటి రిజిస్టర్ డాక్యుమెంటును అందజేస్తున్నట్లు చెప్పారు. వెల్లటూరు సచివాలయ పరిధిలో 98 మందికి ఈ డాక్యుమెంట్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. ధనలక్ష్మి, వీఆర్వో జ్యోతి, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకరరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

అమరావతి: ఓ ప్రైవేటు టీవీ చానల్ ఇంటర్వ్యూలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నాయీ బ్రాహ్మణుల్ని కించపరచడాన్ని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అమరావతి మండల అధ్యక్షుడు ఉంగుటూరు నిబద్ది ఖండించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ జేసీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జీవో ఎఫ్ఎస్ 50 ఉల్లంఘనకు ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బంధం రావూరి రాజ్‌కుమార్, సంఘ మండల సెక్రటరీ బంధ విరామం శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు తాటికొండ హరికృష్ణ, పిల్లట్ల శ్రీనివాసరావు, ఉంగుటూరు తిరేంద్రబాబు పాల్గొన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే శంకరరావు పర్యటన

అచ్చంపేట: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శనివారం అచ్చంపేట మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య శనివారం తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు పులిచింతల ప్రాజెక్టు జలాశయంలో 30లక్షల చేప పిల్లలను వదులుతారన్నారు. అనంతరం 11.30లకు స్థానిక జెడ్పీ అతిథి గృహంలో జగనన్న సురక్షపై జరిగే విలేకరుల సమావేశంలో పాల్గొంటారని చంద్రయ్య పేర్కొన్నారు.

నేడు, రేపు దొడ్లేరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

క్రోసూరు: మండలంలోని దొడ్లేరులో శనివారం, ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సమస్యలతో పాటు సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదో తెలుసుకుంటారన్నారు. అధికారులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

ముప్పాళ్ల: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ యు.నరసింహారావు శుక్రవారం తెలిపారు. వివరాలు.. పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన తాడిబోయిన సురేంద్ర ఈ నెల 30న ద్విచక్ర వాహనంపై ముప్పాళ్లలోని బెల్లంకొండ కోటేశ్వరరావు ఇంటికి వ్యవసాయ పనులపై మాట్లాడేందుకు వచ్చారు. వాహనాన్ని ఇంటి ముందు పార్కింగ్ చేసి లోపలికి వెళ్లి, మాట్లాడి బయటకు వచ్చేసరికి మాయమైంది. ఈ మేరకు ఆయన ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి తెలిపారు. కళాశాలలో గణిత, వృక్షశాస్త్రం అధ్యాపకుల పోస్టుల ఖాళీగాఉన్నట్లు పేర్కొ న్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తి చేసి, బోధనకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 7లోగా దర ఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఎంపికైౖ న వారికి నెలకు రూ.10వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు అధ్యాపకులు ఆదెయ్య (9701008104), రమేష్‌బాబు (9908235544)ను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వినుకొండ (నూజెండ్ల): గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని వెల్లటూరు రోడ్డు గుడ్‌షెపర్డ్ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి జరిగింది. వినుకొండ టౌన్ ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండ పట్టణానికి చెందిన దుర్గా ప్రసాద్ (23), నరసింహ, అనిల్ ద్విచక్ర వాహనంపై వెల్లటూరు రోడ్డు నుంచి వినుకొండ వస్తుండగా గుడ్‌షెపర్డ్ పాఠశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో దుర్గా ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నరసింహ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మరో యువకుడు అనిల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.